# దేవుడు



ఆమెకు కోపం వచ్చింది!

ఆమె చదువుకోలేదు. సంస్కారుల మధ్య పెరగలేదు. పుట్టింది ఒక పేద కుటుంబంలో. పెరిగింది ఒక మారుమూల పల్లె కొంపలో. కాపురం చేసింది వీటి అన్నిటికీ మించిన అధ్వానపు కొంపలో. అయినా ఆమెకు తెలుసు- పేదోళ్ళ కోపం పెదవికి చేటని! అందుకే ఆ పెద్దమనిషి నోటితో అనరాని చెవులతో వినలేని కూతలు కూస్తూ ఉంటే ఆమె పెదవి కదపలేదు. అతి కష్టంమీద ఓర్చుకొనింది.

దండకం చదివినట్టు తప్పుడు కూతలు కూస్తున్న ఆ పెద్దమనిషి ముందు నిలబడలేక... నిలబడి మాటకు మాట అనలేక... ఆ బస్‌స్టాండ్‌లో తనవైపే చూస్తున్న వాళ్ళవైపు తలెత్తి చూడలేక ఆమె తలవంచుకొనింది. మింగలేక మింగలేక కోపాన్ని దిగమింగింది.

కోపాన్ని దిగమింగితే కాళ్ళకు ఊపు వస్తుందని అంతవరకు ఆమెకు తెలియదు!

ఆ బస్‌స్టాండ్‌లో ఒకదాన్నొకటి తరుముతున్నట్లుగా వస్తూ పోతున్న బస్సులు... ఆ బస్సుల వెంటపడి పరుగులు తీస్తున్న జనం... వీటిమధ్య పానకంలో పుడకల్లాగా రిక్షాలు ఆటోలు- అన్నిటిని దాటుకొని దూసుకపోతూ దెబ్బతిన్న లేడిలా ఆమె!

"ఛీఛీ! ఏంబతుకో పాడుబతుకు!"

"ఎన్నాళ్ళు బతికినా ఎప్పుడో ఒకప్పుడు పోవాల్సిందే కదా?... ఇట్టాంటి బతుకు బతికే దానికంటే ఒక్కసారిగా పోతే పోతింది."

"అయినా ఇట్టాంటి హీనపు రాత ఎవురికీ రాసి ఉండరు."

ఆ బస్‌స్టాండ్ దాటుకొని ఆమె ఒక ఊపుమీద నడుస్తూ ఉంది. గుండెల్లో బాధ ఒక్కొక్క అభిప్రాయంగా రూపొంది బయటపడి గాలిలో కలిసిపోతూ ఉంది.

ఆమెకామెకే సందేహం!

అపును పాపం!రావలసిన సందేహమే వచ్చింది.

"గడిచిన రోజులు ఎట్లా గడిచినాయో గడిచిపాయ్‌నాయి. గడవాల్సిన రోజులు ఎట్లా గడస్తాయో ఎవరికి తెల్సు. ఇప్పుడు గడిచే రోజులే ఒక గండంగా ఉండాయి."

ఆమె ఆలోచించడంలో నిజంగా ఒక పద్ధతి ఉంది. పద్ధతి తప్పి ఆలోచిస్తున్నప్పుడు పట్టించుకోవలసిన అవసరం ఉండదు. ఆలోచన పద్ధతిగా ఉన్నప్పుడు బతుకు కూడా ఒక పద్ధతిగానే ఉంటుంది. అటువంటి బతుకును గురించి ఆలోచించవలసిందే!

ఆపూట ఆమె నిద్ర లేచింది ఎప్పుడు? కోడి కూతతో కూడా! ఒంటికి పోయేదానికి రెంటికి పోయేదానికి కూడా కాళ్ళాడవు. ఇక ఒళ్ళు కడుక్కునే ప్రసక్తే లేదు. అంత బొగ్గు లేదా బూడిద నోట్లో వేసుకున్నట్టు వేసుకొనేది. పుక్కిలించి ఊసేది. ఆ తడి చేత్తోనే మొగం తుడుచుకొనేది. పాల క్యానెత్తి చంకన వేసుకొని రోడ్డుకవతల మర్రిచెట్టు కిందికి పరుగోపరుగు. ఆ చెట్టుకింద క్యాన్లు పెట్టకముందు వచ్చేస్తారు. రెడ్డసానులు వస్తారు. నాయుడమ్మలు వస్తారు. శెట్టెమ్మలు వస్తారు- ఒక్కొక్కరొక్క రకం పాట పాడ్తా!

"ఈపొద్దు ఆవుగొడ్డు రోన్ని కుడ్తినీళ్ళు జాస్తిగా తాగేసిందమ్మీ! పాలు ఒకరవ్వ పల్చగా ఉండచ్చు" అంటూ దీర్ఘం తీస్తుంది రెడ్డసాని.

"చింతగింజేస్తే మునగదు. ఈ పాలకే వొప్పారం జెప్తే ఎట్నే" అంటూ మూతిమూడు వంకర్లు తిప్పుతుంది నాయుడమ్మ.

"మన పాలు అట్టాంటిట్టాంటివి గావు. కావాలంటే డికిరీ యేసి సూసుకో. ఇరవైకి తగ్గితే అప్పుడడుగు" అంటూ సవాలు చేస్తుంది శెట్టెమ్మ

"రోంతట్టా యాఁవార్నా! దూడ తాగేసింది. శారడంటే శారడు తక్కవగా ఉంటాయి. కావాలంటే ఇంకొక నాటికి రొండు శారళ్ళు పోస్తాలే! సరిగ్గా మూడు లీటర్లమ్మీ!" అంటుంది బూఁవమ్మ.

ఎవరేమన్నా సరే!– వినాల్సిందే.

వినకుండాపోతే ఆ మరసటి దినం ఈ క్యాన్లో పడాల్సిన పాలు ఇంకొక క్యాన్లో పడతాయి. ఇంకొక క్యాన్లో పడ్తే ఇంట్లో పొయ్యిలో పిల్లి పడుకుంటుంది.

ఆ పిల్లి పోరు పడలేకనే ఈ అగచాట్లు!

"ఆ ఇంటి పాలొచ్చినాయి. అయ్యో ఈ ఇంటి పాలు రాలేదే?" అనుకుంటూ ఉండగానే ఆర్టీసీ బస్సు వస్తుంది. పడ్తా లేస్తా పాల క్యానెత్తి బస్సులో పెడ్తే కండక్టర్ కలెక్టరై పోతాడు. ఆ రుసరుసలు విసవిసలు దబాయింపులు– వాడి పెగ్గి పెనుమూరు దాటిపోతుంది. దక్షిణ చేతులో పడ్తే 'ధన్'మని పడిపోతుంది.

ఇన్ని బాధలుపడి పాలుపట్టి ఆర్టీసీ బస్సులో ఒంటికాలిమీద అష్టకష్టాలుపడి ఆ క్యాన్లు బస్‌స్టాండ్‌లో దింపితే అక్కడా పెద్దమనిషి దొరబాబులాగా దర్జాగా నిలబడి ఉంటాడు. పాలు ఏమాత్రం పలచగా ఉన్నాయనిపిస్తే చాలు. ఆడమనిషి అన్న ఇంగితజ్ఞానం కూడా ఉండదు. 'ఒక ఇంటి పాలు కాదు గదా? నాలుగిండ్ల నాలుగు విధాలుగా పోస్తారు కదా?' అన్న ఆలోచన ఉండదు. తనకు ఉన్నవన్నీ చెప్తాడు. అదే పల్లెటూళ్ళో అయితే పాలు పట్టేవాళ్ళు పదిమంది. ఒక్కరు కాదంటే ఇంకొకరికి. ఇక్కడట్లా కాదే? ఆ దొరబాబుకు ఎదురులేదు. ఎదురు నిలబడ్తే వాడేమవుతాడో వాడికే తెలియదు.

అందుకే బతుకులో అభిమానం చంపుకొని పాలు అమ్ముకోవలసివస్తూ ఉంది. అమ్ముకోకపోతే బతుకు? అయినా అతడు చేస్తున్నది పాల వ్యాపారమే. తాను చేస్తున్నదీ ఆ వ్యాపారమే. తాను ఇన్ని అగచాట్లు పడ్తా ఉంటే ఆ మొగలాయి చేతికి మట్టిగాదు. గుడ్డ నలగదు. నోట్లో జానెడు పొడుగు సిగరెట్ ఆరదు!

అదేమంటే కర్మ అంటారు. కాదంటే అదృష్టమంటారు.

తన బతుకును నిర్దాక్షిణ్యంగా కర్మ కౌగలించుకుంటే అదృష్టం ఆమడల దూరాన నిలబడి వెక్కిరిస్తూ ఉంది.

చంకలో ఒక క్యాను చేతిలో ఇంకొక క్యాను పట్టుకొని నడుస్తూ ఉంటే ఆమె ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

ఆమె నడుస్తున్న బాట ప్రక్కన ఒక పెద్ద భవనం. ఆ భవనం చుట్టూ కాంపౌండు గోడ. ఆ గోడ వెలుపల గుంపులు గుంపులుగా జనం. నడుస్తూ ఆమె గమనించింది.

"అక్కడ ఏం జరుగుతూ ఉంది? అంతమంది ఎందుకు అక్కడ గుంపు చేరారు? ఏదో వింత వినోదం ఉండకపోతే అంత పొద్దున్నే అంతమంది ఎందుకు గుంపు చేరతారు?" అని ఆలోచించి అక్కడ నిలబడి అడిగి తెలుసుకునే పల్లెమనస్తత్వం.

అయితే ఆపూట మనసులో మనసు లేదు. ఆ పెద్దమనిషి కూసిన కూతలు గుండెల్ని కోస్తూనే ఉన్నాయి. వద్దనుకొన్నా ఆలోచనలు అటువైపే పోతున్నాయి. కోపం తగ్గలేదు.

కాళ్ళు మంచి ఊపుమీద ఉన్నాయి!

"ఈ కాళీ క్యాన్లెత్తుకోనిపాయ్ ఆడేదన్నా వొక టీబంకులో విసిరిపారేసి ఏదైనా వొక సిలమాకుబొయ్ కూసుంటే ఈబాదట్టా పర్సిపోతింది. ఈఏదుపు ఎల్లకాలంఉండే ఏడుపే గదా?"

తన బాధ మరిచిపోవడానికి ఏదైనా ఒక సినిమా చూడాలన్న తలంపుతో ఆమె నడుస్తూ ఉంది. ఆ వీధి మలుపు తిరిగింది. మరొక వీధిలో అడుగు పెట్టింది. ఆ వీధిలో ఒక వంద గజాల దూరం నడిచిందో లేదో అదే దృశ్యం! తాను ఇంతకు మునుపు చూసిన దృశ్యమే కంటపడింది.

ఆమె అక్కడ జరుగుతున్న తంతును అదొక వింతగా చూస్తూ నిలబడింది!

ఆ భవనం ఇంతకుమునుపు చూసిన దానికంటే పెద్దది. అక్కడికంటే ఇక్కడ ఎక్కువగా జనం. కార్లలో కొందరు... నడకమీద కొందరు జోరుగా వస్తున్నారు. ఆ భవనం ముందు నిలబడుతున్నారు. కొందరు కాలుగాలిన పిల్లుల్లా నిలిచిన చోట నిలబడలేకపోతున్నారు. కొందరు ఆ భవనానికి ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరు నిలబడిన చోటునుండి అటు ఇటు కదలకుండా ఆ భవనంవైపు నిశ్చల దృష్టితో చూస్తున్నారు.

"ఎందుకో? ఏమో? మనకెందుకు?" అని ముందుకు వెళ్ళపోయింది. తెలుసుకోవాలన్న ఆతురత. ముందుకు వెళ్ళలేక పోయింది.

ఒక నడివయస్కుడు. సైకిల్‌కు స్టాండ్ వేశాడు. ఆ సైకిలు మీదికి వంగి సీటు మీద రెండు మోచేతులు ఆనించాడు. రెండు అరచేతుల్ని ముఖానికి ఆధారం చేసుకొన్నాడు. రెప్పార్పకుండా ఆ భవనంవైపే చూస్తున్నాడు– ఆ మధ్యతరగతి మానవుడు!

ఆమె అతనిదగ్గరికి వెళ్ళింది. పక్కనే నిలబడింది. అయినా అతడు గమనించే స్థితిలో లేడు.

"ఈడేం జరగతా ఉండాదయ్యా? ఇంతమందిట్టా ఆరాటం పారాటం మిందుండారే?" అని అడిగింది.

అప్పటికూ్డా అతని ఏకాగ్రతకు భంగం కలగలేదు. అతని దృష్టి మారలేదు. కనీసం అడుగుతున్నది ఎవరని గమనించలేదు. అయితే– "పిల్లోళ్ళు పదో తరగతి పరీక్షలు రాస్తా ఉండారు" అని మాత్రం బదులు చెప్పాడు.

"రాస్తా ఉంటే?"

ఆమె అడగడంలో ఆశ్చర్యం ధ్వనించింది. అతని ఏకాగ్రతకు భంగం కలిగింది. చూపు మళ్ళింది. అతడు ఆమెను చూశాడు. ఆమె అతన్ని చూస్తూ ఉంది. "ఇదేదో పల్లెటూరి వ్యవహారంగా ఉందే?" అని గ్రహించాడు.

"రాస్తా ఉంటే?– అంటే రాసేది ఏఁవనుకున్నావ్? పాల లెక్కనుకున్నావా? కాదు పరీక్షలు!"

"నా పాల లెక్కా? అదేఁవుండాదిలే. ఎవుడో నీబోటోణ్ణి రాయమంటే పోసినోళ్ళది పొయ్‌నోళ్ళది అందురిదీ రొండు ఎగేసి ఒకటి తీసేసి రాసి పారేస్తాడు. పరీచ్చలంటే తెలియక కాదు అడిగింది. వాళ్ళు పిల్లోళ్ళు లోపల కూసోని వాళ్ళపాటికోళ్ళు రాసుకుంటూ ఉంటే ఈళ్ళందరూ నిన్నుబట్టు నన్నుబట్టని ఎందుకిట్టా ఎగబెట్టుకోని తిరగతా ఉండారే?"

సైకిల్ సీటు మోపుతో వంగి నిలబడిన మనిషి చివుక్కుమని లేచి నిటారుగ నిలబడ్డాడు. నిలబడి పకపక నవ్వుతున్నాడు.

అతడు ఎందుకు అలా నవ్వుతున్నాడో అర్థం కాకుండా ఆమె అతనివైపు అయోమయంగా చూస్తూ ఉంది. పల్లెటూరి బాపత్తు అని గ్రహించాడు కదా? కాస్త వివరంగా చెప్పాలనిపించింది.

"పరీక్షలంటే ఈ పరీక్షలు అన్ని పరీక్షల మాదిరి కాదు. పిల్లోళ్ళ భవిష్యత్తును నిర్ణయించేది ఈ పరీక్షలే. ఈ గండం గడిచి బయటపడిపోతే ఆ తర్వాత వాళ్ళు కాలేజీ మెట్టెక్కుతారు. అక్కడ ఆ వాతావరణమే వాళ్ళను మార్చేస్తుంది. వాళ్ళ బాధ్యత వాళ్ళకు తెలుస్తుంది. అందుకే లోపల పిల్లోళ్ళు పరీక్షలు రాస్తుంటే ఎట్లా రాస్తున్నారో ఏమో అని బయట పెద్దోళ్ళకీ తపన. అట్లా చూడు! ఆ కిటికీల గుండా బిట్లు అందించాలని వాళ్ళు పడ్తావుండే యాతన. ఏ కిటికీ దగ్గర వీలుపడుతుందో అని వీళ్ళ పరుగులు చూడు. ఇక్కడ నిలబడిన వాళ్ళ మొగాల్లో ఆందోళన చూడు...!"

చెప్తూ చెప్తూ అతడు ఆమెవైపు చూశాడు.

ఎక్కడుందామె? ఏదో పెట్టి మరిచిపోయిన దానికోసం పరిగెత్తినట్లు అప్పటికే ఎక్కడో అంత దూరాన తిరిగి చూడకుండా నడుస్తూ ఉంది.

ఆమె అడిగింది. అతడు చెప్తున్నాడు. అయితే ఉన్నట్లుండి ఎందుకలా వెళ్ళిపోయిందో అతడికి అర్థం కాలేదు. ఆశ్చర్యంగా ఆమె వెళుతున్నవైపే చూశాడు. ఆతర్వాత యథావిధంగా సైకిలు సీటు మీదికి వంగాడు. ఆ పాఠశాలవైపు తదేకంగా చూస్తున్నాడు.

ఆమె నడుస్తూ ఉంది.

ఇప్పుడామె మనసులో సినిమా చూడాలన్న ఆలోచన లేదు.

ఆ పెద్దమనిషి కూసిన కూతలు గుండెల్ని కోయడం లేదు.

ఆ స్థానాన్ని తన ఒక్కగానొక్క కొడుకు ఆక్రమించుకొన్నాడు. ఆ కొడుకు అందరి పిల్లల్లాగే ఆరోజు పదవ తరగతి పరీక్ష రాస్తున్నాడు.

ఆమె నడుస్తూ ఉంది. ఆబడి ముందు దృశ్యం కండ్లకు కట్టినట్లుంది.

"తమ బిడ్డలు పరీక్షలు ఎలా రాస్తారో? వాళ్ళ బతుకులు ఏమవతాయో?" అని ఆ బడిచుట్టూ తిరుగుతూ వాళ్ళు పడే తపన తపనగాదు. మొక్కే మొక్కులు మొక్కులు గాదు. అందరి బిడ్డల తల్లిదండ్రులు అలా ఉంటే తానేం చేసింది? పాలమ్ముకోవడానికి వచ్చింది!

"బిడ్డ పరీక్ష రాసే కనీసం ఈ వారం పదిరోజులైనా కొంపలో కుదురుగా కూర్చొని వాడికి వేళకన్ని నీళ్ళో నిప్పులో పోసి అంత వండిపెట్టి పరీక్ష రాసేదానికి పంపలేని బతుకు?– ఛీ! ఏం బతుకో ఈ పాడు బతుకు!"

"కొంపలో కుదురుగా కూర్చోవడం! ఈ బతుకులో ఎప్పుడు కుదిరింది?"

పావడ గట్టి మేకలు మేపింది. పైట వేసుకొని అప్పుడు కడుతున్న కళ్యాణి డాంకు రాళ్ళు మోసింది. చీర గట్టేటప్పటికి కడుపు పుట్టిన బిడ్డ ఇల్లు పట్టలేకపోయింది. 'ఆడ పుట్టక పుడ్తే

ఏనాటికైనా ఎవుడి చేతిలోనో ఒకడి చేతిలో పెట్టక తప్పదుగదమ్మా?' అంటూ అమ్మా, నాయన ఎవడి చేతిలోనో పెట్టి చేతులు దులుపుకొన్నారు.

బొటనవేలు తొక్కి బొట్టు కట్టిన పుణ్యాత్ముడు ఏమి చేసి ఏమి చేయకపోయినా ఏడాది తిరగకముందే కడుపు చేశాడు. చుట్టచుట్టి నెత్తిన నిందపెట్టి పుట్టింటికిదారి చూపాడు.

కనుగందును చేతుల్లో పెట్టుకొని కన్నతల్లిని వెదుక్కొంటూ పుట్టిల్లు చేరింది.

"సీత పుట్టి లంక జెడె. ఆ పిలగోడు పుట్టి దాని బతుకిట్టా తెల్లారె!" అన్నారు ఇరుగుపొరుగు.

వాడు పుట్టి తన బతుకిలా తెల్లారిందా? లేకుంటే తన కడుపులో పుట్టి వాడి కర్మ ఇలా కాలిపోతూ ఉందా? తెల్సుకోలేని పరిస్థితి. నిజానికి వాడే లేకుంటే ఈ లోకంలో తనకు ఏనాడో నూకలు చెల్లిపోయేవి. ఇన్నాళ్ళు ఇన్ని బాధలు పడి వాడిని సాకి సంతరించడం ఒక ఎత్తు. చదువు చెప్పించడం ఇంకొక ఎత్తు. అయినా ఈపూట వాడు పరీక్షలు రాస్తుంటే పట్టించుకోలేని పరిస్థితి. ఏపూటకాపూట పాలు అమ్ముకొంటేకానీ గడవని గతి!

రాత్రి వండుకొన్నకూడు తినిమిగలగా నీళ్ళుపోసి పెట్టింది. ఆనీళ్ళలో కూడు...!

వేడి నీళ్ళతో స్నానాలు చేయించి... వేడివేడిగా టిఫిన్లు తినిపించి... కార్లలో... స్కూటర్లలో తెచ్చి బడిదగ్గర దింపుతున్నారు. 'ఎలా రాస్తారో ఏమో?' అని బయట నిలబడి ఎదురు చూస్తున్నారు.

అదే తన బిడ్డకు? రాత్రి నీళ్ళు పోసిపెట్టిన కూడు. ఎలా తిన్నాడో ఏమో? ఇక స్నానం? ఎవరున్నారు వేడినీళ్ళు పెట్టివ్వడానికి?

ఆమె గుండె చెరువయింది.

కన్నీళ్ళు పొంగుతున్నాయి.

నిబ్బరించుకోలేక నడిరోడ్డులో నిలబడి బోరోమని ఏడ్చేసింది.

అది కన్నపేగు!

గుండెల్లో బరువు కన్నీటి రూపంలో బయటపడేసరికి మనసు కాస్త తేలికపడింది. అప్పుడు తెలిసి వచ్చింది తాను నడిరోడ్డులో నిలబడి ఏడుస్తున్నానని...! ఆ దారినివస్తూ పోతున్నవాళ్ళు తనవైపే చూస్తున్నారని!

సిగ్గు ముంచుకొచ్చింది. అయినా కన్నీళ్ళు ఆగలేదు. ఆగని కన్నీళ్ళను దాచుకోవడానికి ఆశ్రయం కావలసి వచ్చింది. అటుఇటు చూసింది. కనుచూపు దూరంలో ఒక దేవాలయం. అదే అనువైన స్థలం అనుకొనింది. నడక పరుగ్గా అక్కడికి చేరుకొనింది.

గుడిలో దేవుడు!

ఆ దేవుణ్ణి చూస్తుంటే ఆమెకు కన్నీళ్ళు కట్టలు తెంచుకొన్నాయి!

చెంపలమీద కన్నీళ్ళు ధారలు ధారలుగా ప్రవహిస్తూంటే ఆమె దేవుణ్ణి తదేకంగా చూస్తూ నిలబడింది- ఇదేమి న్యాయమని అడుగుతున్నట్లు!

గుడిలో పూజారి గమనించాడు.

"అయ్యో పాపం! ఆడకూతురు. బాధపడుతూ ఉందే? ఎందుకు బాధపడుతూ ఉందో ఏమో?" అని జాలిపడ్డాడు. ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు.

"అక్కడున్నది ఎవరు? దేవుడు. దేవుడి ముందు నిలబడి ఏడవకూడదు. తప్పుకదూ? ఎందుకేడుస్తావ్? దేవుడున్నాడు. ఆయన నీ బాధలు తీరుస్తాడు. ఏడవద్దమ్మా ఏడవద్దు!"

పూజారి ఇంత చెప్పింది మాటలతో కాదు– సైగలతో!

పూజారి చెప్తున్నది ఆమెకు అర్థం కావడంలేదు.

కన్నీళ్ళు ఆగడం లేదు!

పూజారికి సహనం నశించింది.

"చెప్తున్నదెవరికి...? నీకేగదా...? ఎందుకా కన్నీళ్ళు...? దేవుడున్నాడని చెప్తుంటే...?"

కోపం! ఆ కోపంతో చేస్తున్న సైగలు. అతడికి తెలియకనే నోట్లో పడి బెబెబె బ్బెబ్బెబ్బె!గా మారాయి.

అతడేం చేయగలడు? పాపం! మూగవాడు!

అంత బాధలోకూడా ఆమెకు నవ్వు వచ్చింది.

తన బాధను వెళ్ళబోసుకోవడానికి దేవాలయానికి వెళితే అక్కడ పూజారికూడా మూగవాడే! ఇక ఎవరితో చెప్పుకోవాలి?

ఇంతటికీ తన బాధ ఏమిటి?

పిల్లలు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. తల్లిదండ్రులు ఆ పిల్లలకు తెల్లవారకముందే వేడినీళ్ళ స్నానాలు చేయించి వేడివేడి టిఫిన్లు తినిపించి కార్లలో స్కూటర్లలో రిక్షాల్లో తెచ్చి బడిదగ్గర దింపుతూంటే కనీసం తన బిడ్డ పరీక్ష రాస్తున్నాడన్న స్పృహ కూడా తనకు లేకుండాపోయింది. ఎంత దౌర్భాగ్యం?

ఆ తల్లి– అందరి తల్లిదండ్రుల్లా తన బిడ్డకు కనీస సౌకర్యాలు చేయలేకపోయామని బాధ పడిందేకానీ, అలాచేస్తున్న తల్లిదండ్రులు సిగ్గుమాలి చేస్తున్న వెధవ పనుల్ని గురించి ఆలోచించలేకపోయింది. బిట్లు అందించడం... కాపీలు కొట్టించడం... ఇలా ఎన్నో తొక్కరాని అడ్డదారులన్నీ తొక్కి నిజంగా ప్రతిభ కలిగిన తనబిడ్డలాంటి ఎందరో బిడ్డల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని గ్రహించలేకపోయింది.

నివేదించవలసిన ఈ సాంఘిక దురన్యాయాన్ని దేవుడికి నివేదించలేక పోయింది.

ఆ దేవాలయంలో అడుగుపెట్టి ఆమె కూడా మూగదై పోయింది.

ఆమె మూగది! పూజారీ మూగవాడు!!

ఈ ఇద్దరు మూగవాళ్ళు నమ్ముకున్న దేవుడు ఎప్పుడో మూగవాడైపోయాడన్న సంగతి పాపం! వాళ్ళకేం తెలుసు? ●

ఆంధ్రప్రభ
(13, జనవరి 1993)